



జనగామ రూరల్ : ఎమ్మెల్యే పల్లాను అభినందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు రేఖా రాజు, డాక్టర్లు రాజమౌళి, శ్రీనివాస్, బచ్చన్నపేట : పల్లాను సన్మానిస్తున్న చిట్టిబాబు


# అందరికీ రుణపడి ఉంటా..

- విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి
- పల్లాకు అభినందనల వెల్లువ
- పుష్పగుచ్ఛాలు అందించి సన్మానం

జనగామ రూరల్, డిసెంబర్ 4: నెల రోజులు తన గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జనగామ మహిళా మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖా రాజు ఎమ్మెల్యే పల్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పల్లా మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. జనగామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు అధైర్య పడకుండా ఉండాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు తదితరులు పల్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### కార్యకర్తలను కాపాడుకుంటా..

జనగామ చౌరస్తా : జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ఆయన అభిమానులు, సానుభూతిపరుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే పల్లా నివాసంలో వైద్యులు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ అన్ని రంగాల్లో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అందరిని కలుపుకొని పనిచేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సీహెచ్ రాజమౌళి, సుగుణాకర్‌రాజు, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కన్నారపు ఉపేందర్, కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, ఆకుల సతీశ్, జైన రమేశ్, ఊడ్గుల నర్సింహులు, తిప్పారపు విజయ్, ఆనంద్, నర్రా నవీన్, రాజు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జనగామ చౌరస్తా : విజయవాడ కనకదుర్గ ఆలయంలో కౌన్సిలర్ పద్మా యాదగిరిరెడ్డి దంపతులు

### పల్లా గెలుపొందడంతో మొక్కుల చెల్లింపు

జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో సోమవారం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని స్థానిక కౌన్సిలర్ బండ పద్మా యాదగిరిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

### 'పల్లా'కు సన్మానం

బచ్చన్నపేట : పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామలో సోమవారం నక్కపిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వీఎస్సార్ నగర్ అధ్యక్షుడు కాలియ చిట్టిబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పల్లాకు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లాపై జనగామ ప్రజలకు నమ్మకం ఉందన్నారు. అధికారంలో లేకున్నా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. మండలం నుంచి వందలాది మంది పల్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు బావండ్ల కృష్ణంరాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనకయ్య గౌడ్, నరేందర్, షబ్బీర్, ఐలయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జఫర్‌గఢ్ మండలంలో ఆధిక్యం చాటిన బీఆర్ఎస్

జఫర్‌గఢ్, డిసెంబర్ 4 : శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరికి మండలంలో 959 ఓట్ల ఆధిక్యత వచ్చింది. మండలంలోని 18 గ్రామాల్లోని 41బూత్‌ల్లో మొత్తం ఓట్లు 36,933 ఓట్లు ఉన్నాయి. 33,067 ఓట్లు పోలయ్యాయి. 89.39 పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్‌కు 12,808 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 11, 859 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర కంటే బీఆర్ఎస్ అభ్యర్థికి 959 ఓట్లు అధికంగా పోలయ్యాయి. గ్రామాల వారిగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హిమ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు 894 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 737 ఓట్లు వచ్చాయి. కోనాయిచలంలో 549, 572, తిడుగు 546, 500, సాగరం 714, 490 సూరారం 455, 526 తీగారం 619, 716, జఫర్‌గఢ్ 1,615, 1,820, రేగడితండా 522, 359, కూనూరు 1,148, 1,120 తమ్మడపల్లి(ఐ)753, 500, తిమ్మంపేట 804, 928, ఉప్పుగల్లు 1122, 1,098, రఘునాథపల్లి 588, 642, షాపల్లి 334, 156 తిమ్మాపూర్ 320, 328 తమ్మడపల్లి(జి) 1,059, 683, ఒబులాపూర్ 649, 369, ముగ్దుంతండాలో బీఆర్ఎస్‌కు 407 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 315 ఓట్లు వచ్చాయి.

# ఓటర్లకు కృతజ్ఞతలు

- కార్యకర్తలు అధైర్య పడొద్దు..
- మనకు ఎమ్మెల్యే 'పల్లా' అండ
- రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి

బచ్చన్నపేట, డిసెంబర్ 4 : జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపులో భాగస్వాములైన కార్యకర్తలు, నాయకులు, ఓటర్లకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నామని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి వెల్లడించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లాను గెలిపించుకునేందుకు పడ్డ శ్రమ వృథా కాలేదన్నారు. కార్యకర్తలు, నాయకులకు పల్లా అండగా ఉంటాడన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాలేదని ఎవ్వరూ అధైర్య పడొద్దన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే పని చేశామో అలాగే రాబోయే రోజుల్లో పని చేద్దామని పిలుపు ఇచ్చారు. పల్లా ప్రజల కష్టసుఖాలు, కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటారన్నారు. అందులో సంకోచం ఏమి లేదన్నారు. జనగామలోనే నివాసముంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. రాబోయే రోజుల్లో మరింత పట్టుదలతో పని చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మనకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా మనల్ని ఆదుకునేందుకు పల్లా ఉన్నారన్నారు. ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, రేపటి రోజుల్లో మనమే ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గంధమల్ల నరేందర్, మండల నాయకులు బావండ్ల కృష్ణంరాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనకయ్య గౌడ్, నాయకులు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, షబ్బీర్, వినయ్, నర్సిరెడ్డి, నాగేశ్, ఐలయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

### ఓటర్లే మా దైవం..

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినా జనగామలో మాత్రం ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు గాను కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు, ఓటరు దేవుళ్లకు కృతజ్ఞతలని మండల ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. ప్రతి పార్టీకి కార్యకర్తలు ఒక సైనికులన్నారు. బీఆర్ఎస్ ఒక పెద్ద కుటుంబమని, అందులో అందరూ సమానమేనని అన్నారు. పల్లా గెలుపులో భాగస్వాములైన వారికి ధన్యవాదాలు తెలిపారు.

## రేపు సింగరాజుపల్లిలో విద్యుత్ వినియోగదారుల వేదిక

దేవరుప్పుల, డిసెంబర్ 4: మండలంలోని సింగరాజుపల్లి సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈ నెల 6న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఏఈ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. సింగరాజుపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ వేదికకు విద్యుత్ వినియోగదారుల చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలాచారి హాజరవుతారని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వేదికలో వినియోగదారులు తమ సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందన్నారు. దేవరుప్పుల, లింగాలఘనపురం మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ వేదికలో పాల్గొనవచ్చన్నారు. ఈ వేదికపైనే తమ సమస్యలైన విద్యుత్ పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్ల మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకంలో హెచ్చుతగ్గులు, క్యాటగిరీ మార్పు, సర్వీసు రద్దు వంటి సమస్యలను లిఖిత పూర్వకంగా ఇస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ వేదికకు చైర్మన్‌తో పాటు ఫోరం సాంకేతిక సభ్యుడు, ఫైనాన్స్ సభ్యుడు హాజరు కానున్నట్లు ఏఈ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాము

## నూతన విధానంలో విద్యనందించాలి

**జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి రాము**

బచ్చన్నపేట, డిసెంబర్ 4 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు నూతన విధానంలో విద్య అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నోడల్ అధికారి మూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు తరగతి గది నుంచే పునాది వేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ నిర్వహణలో ఎదురయ్యే అడ్డంకులను గురించి చర్చించారు. సరైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలుగా శ్యాంమోహన్‌రాజు, పరశురామన్, హెచ్ఎం నీలం వేణు, శోభ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొబ్బరికాయల విక్రయ వేలం వాయిదా

లింగాలఘనపురం, డిసెంబర్ 4 : మండలంలోని జీడికల్‌లో సోమవారం చేపట్టిన కొబ్బరికాయల విక్రయాల వేలం వాయిదా పడింది. సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు అధికారులు వేలం నిర్వహించారు. గత సంవత్సరం వేలంలో రూ.2.74 లక్షలు రాగా సోమవారం నిర్వహించిన వేలంలో గుత్తేదారులు సిండికేట్‌గా మారి రూ,1.96 లక్షలకు మించి వేలం పాటను పెంచలేదు. దీనితో అనుకున్నంత వేలం పాట రాక పోవడంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈవో శేషుభారతి, సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. కాగా , బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిత్యనిధి, ద్వారాతోరణ బంధనం, భేరీపూజ, ఆరగింపు తీర్థగోష్టి చేపట్టారు. కార్యక్రమంలో పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, ఆచార్య వర్సిణ్, బుచ్చయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం అందజేత

దేవరుప్పుల, డిసెంబర్ 4: మండలంలోని మన్‌పహాడ్ గ్రామంలో ఇటీవల జోగు సోమయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ వర్రె మధు యాదవ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బియ్యం అందిస్తున్న సర్పంచ్ మధు